*మా ఇంట్లో ఎలకల బెడద మరీ ఎక్కువయ్యేసరికి 'ఎలుకలు రారాదు', 'నో ఎడ్మిషన్ టు రాట్స్' అని అలమరాలనిండా రాశాను*

# నోటీసులు

**కె.వి.యల్ నరసింహాశాస్త్రి**



రెండు మూడు రోజుల తర్వాత ఒక అలమరా తలుపు తెరవంగానే రెండు పంది కొక్కుల్లాంటి ఎలుకలు ఎగిరి దూకినయ్. ఇట్లా కాదనుకుని 'పిల్లి ఉన్నది జాగ్రత్త' అని మరో నోటీసు అంటించాను, అదీ లాభం లేకపో యింది.

ఇప్పుడా ? ఎప్పుడో చిన్నప్పటి నుంచీ నా నోటీసు లివ్వటం అలవాటు. 'ఇవాళ [illegible]గా బళ్లోకెళ్ళాలి, అన్నంపెట్టు' అని అమ్మకు వ్రాసి చూపించేవాణ్ణి. ఎప్పుడన్నా డబ్బు కావాల్సివస్తే, 'ఫలానా దానికి డబ్బు కావాలి'అని వ్రాసిచూపిస్తే నాన్న ఇచ్చేవారు

కాని, అదేమిటో నా నుంచీ ఏవన్నా పనికావాల్సి వచ్చినా ' నోటీసు ' ఇచ్చేవారు. అమ్మయితే 'రమణా, బజారుకెళ్లి కిలో కంది పప్పు పట్టుకొస్తావా' అని రాసి చూబించేది నేను తలూపుకుంటూ వెళ్లి తీసుకొచ్చేవాణ్ణి.

నాకు చదువు వయసుకు మించి వచ్చిందని మాయింట్లో మాటల సందర్భం వస్తే ఇప్పటికీ అంటుంటారు కానినేను మెట్రిక్ దాటి చదవలేకపోయినాను స్కూల్లో.

ఉన్న ఊళ్ళోనే వో కొట్లో గుమాస్తా ఉద్యోగానికి కుదిరాను తమ్ముడు కాలేజి చదువులకెళ్ళి పోయినా, నేనింట్లో ఉండాల్సి వచ్చింది. 'నువ్వు మమ్మల్ని కనిపెట్టుకుని ఉండాలిరా కన్నా' అని అమ్మ అంటూఉండేది. అలా అంటున్నపుడు ఎందుకో అమ్మ కళ్లల్లో లీలగా నీళ్లు కనిపించేవి, నేను వేదాంతిలా నవ్వుకుంటూ "ఆ 'అదృష్టం' చాలు" అని నాకు నేను నోటీసిచ్చుకునే వాణ్ణి.

మనం అనేక గోడలమీద చూస్తుంటాం, 'ఇచట నో టీ సు లు అంటించరాదు,' 'స్టిక్‌నోబిల్స్' అని. అక్కడే బోల్డు సినిమా పోస్టర్లు, వ్యాపార ప్రకటనలు ఉంటాయి. అసలు 'స్టిక్‌నోబిల్స్' అన్న నోటీసులే ఎక్కువ.

ఏమయితేనేం, నాది నోటీసుల బ్రతుకై పోయింది. అన్నానికి నోటీసు. అల్పాహారానికి నోటీసు, ఆమోదానికి నోటీసు, ఆవేశానికి నోటీసు. నా నోటీసుల జీవితా న్నెవరూ అశ్రద్ధ చేయలేదు

మొక్కలు పెరిగి చెట్లయి చిగిర్చి పూలు పూస్తాయి. తర్వాత అవి రాలిపోయి ఒట్టి మోదు మిగుల్తుంది. ఇంతలో ఒక సంవత్సర కాలం గిర్రున తిరుగుతుంది.

కాలం ఆగదు ఏ ఒక్కరికోసం, కాని ప్రతిజీవియొక్క జీవించిన కాలం మాత్రం పెరిగిపోతూ ఉంటుంది కాలంతోపాటు.

చెట్లయి పుట్టినందుకు చిగర్చకా తప్పదు, పూలు పూయకా తప్పదు. మనిషై పుట్టి నందుకు ఆశలుండకా తప్పదు, వాటిలో కొన్నిటినైనా తీర్చుకోక తప్పదు.

నాకు యుక్తవయసు వచ్చినట్లు, మా యింట్లోవాళ్ల మాటలబట్టి తెలుసుకున్నాను. వాళ్లు నాకు పెళ్లి చేయాలనుకుంటున్నారనీ తెల్సింది. మరి నా నోటీసుల జీవితానికి నోటీసులా వచ్చి అతుక్కునేదెవరు ? ఎవరు ఏరికోరి నోటీసులివ్వడానికి ఒప్పుకుంటారు ?

ఎడారిలో జలపాతం ప్రవహిస్తుందని

తెలిస్తే, ఆ ఎడారి ఎంత పులకించిపోతుంది? విరిగిన కొమ్మకి కూడా పూలు విరగకాస్తా యంటే ఆధారంలేని ఆ కొమ్మ ఆకులు ఎండి పోతాయా ?

కాని ఇప్పుడు కావాల్సింది, ఎడారిలో జల పాతమున్నూ, విరిగిన కొమ్మకు పూలున్నూ, ఇవి సాధ్యమయ్యేవేనా ?

అయినా మా ఇంట్లో కార్యక్రమాలు చురుకుగానే సాగిపోతున్నయ్ నేనుగూడ అడ్డుపెట్ట దలుచుకోలేదు వామూలంగా నా తమ్ముడు, చెల్లెళ్ళ బంగారు భవిష్యత్తు ఆగిపోకూడదు

ఓ సంబంధం వచ్చింది. 'మా అబ్బాయి మహాద్భుతంగా నోటీసులు తయారు చేస్తా డని' చెప్పేసరికి వాళ్ళదారి వాళ్ళు వెతుక్కు న్నారు

నాలో నేను నవ్వుకున్నాను.

తర్వాతే వో రెండు మూడు వచ్చాయి. వాటికి నోటీసులివ్వటంగాని, పుచ్చుకోటం గాని ఇష్టంలేదు అంచేత ఆపి అంతే!

మా వాళ్ళు విసిగినట్టున్నారు.

'ఈనోటీసుల విషయం చెప్పండా'అన్నారు.

నేనేమంటాను ? సరే అన్నాను.

దాదాపు ఐదారు నెలల తర్వాత ఓ సంబంధం వచ్చింది. నాన్న ముందువెళ్లి చూసొచ్చి 'అపరంజిబొమ్మ' అన్నారు.

తర్వాత అందరితోపాటు నేనూ వెళ్ళాను, ఆ 'అపరంజిబొమ్మ'ని చూసే నిమిత్తం.

పెళ్లిచూపులేర్పాటు చేయబడ్డాయి.

అన్ని ప్రశ్నలకు నాన్నే సమాధానం చెప్తు న్నారు. నా కవకాశం లేకుండా. కాబోయే మామగారనుకుంటా 'అమ్మాయెట్లా ఉంది బాబూ' అనడిగాడు.

నేను సమాధానంగా నవ్వి నాన్నవైపు చూశాను

ఆ 'అపరంజి' పేరు సుభాషిణి.

లోపలనుంచి ఏవో మాటలు వినపడు తున్నాయి. ఆడవాళ్ల మాటలు. 'అబ్బాయి మితభాషి అనుకుంటా, మనమ్మాయికి సరైన జోడీ ..'

నాన్న హడావిడిని చూసి, మోసగిస్తున్నా నేమోనని అనుకున్నాను.

నాన్నకు వ్యతిరేకంగా మాట్లాడే అవకాశం, నా అభిప్రాయాన్ని నచ్చచెప్పే ధైర్యం — ఏవీనాకు ?

అంచేతే సుభాషిణి మెళ్లో పురోహితుల మంత్రాలమధ్య, సన్నాయి బాజాలతో 'తాళి' కట్టేశాను.

సుభాషిణి నా ఇల్లాలైంది.

అది—

ఎన్నోరాత్రులు వస్తాయి,
కాని అదియే తొలిరేయి,

సుభాషిణి గదిలోకి వచ్చింది. నేనామె వైపు నడిచాను.

ఆమె కళ్లల్లో కన్నీరు చూసి ఉలిక్కి పడ్డాను ఆమె పెదాలు వణుకుతున్నాయి.

ఆమె ఎందుకు బాధపడుతోందో, మనసులో ఏంవుందో, నాకెలా తెలుస్తుందీ ?

ఇక నేను ఉండబట్టలేకపోయాను.

కాగితమూ, కలం తీసుకున్నాను 'నోటీ సుకి ' అవెప్పుడూ నాపక్కనే ఉంటాయిగదా?

నోటీసుల జీవితంలో నోటీసు లెందు కిస్తారో మీకు తెలుసా ? నోటీసులంటే నోటి ఈసులు కావు, నోటి ఊసులు. గలగల మాట్లాడాల్సిన నోరు, 'ఒక్క మాట కూడా మాట్లాడొద్దు' అని శాసిస్తే, అప్పుడే కాగితం కలం, నోటీసుల తయారీ!

నేను కాగితంమ్మీద 'సుభాషిణీ, నాకు మాటలురావు, నీ అందాన్ని అభివర్ణించ టానికి కాదు. అసలు రావు, అంటే మూగ వాణ్ణి' అని రాసి ముందుపడేశాను.

సుభాషిణి చదివింది. చురుగ్గా తలెత్తింది.

ఇప్పుడు నేనేమైపోవాలి ? ఆమె ఉసురు గీసిన అగ్గిపుల్లకి భస్మమైపోవాలా ? స్వార్థం కోసం మావాళ్ళు చేసిన ఈ తడిగుడ్డతో గొంతుకోతకు, పాపం, అమాయకురాలు బలికావాల్సిందేనా ?

సుభాషిణి నా దగ్గర నుంచి కలం తీసుకుంది.

ఓహ్, సుభాషిణి నాకు తగిన ఇల్లాలు, నాకేదో నోటీసిస్తోందన్నమాట! పెద్దవాళ్ళు 'గంతకుతగ్గ బొంత' అంటారు. మా జంటని భగవంతుడిందుకే కలిపాడేమో ? ఎంత సహనం సుభాషిణికి ?

ఇక నా జీవితానికేం ఫర్వాలేదు. సుభాషిణి సహచర్యంలో నా నోటీసులు, నోటి ఈసులు కాదుసుమా నోటి ఊసులే, నిరాటంకంగా సాగిపోతాయి. చాలు, నాకది చాలు.

సుభాషిణి పూర్తిచేసినట్లుంది.

కాగితం నాకిచ్చింది.

''క్షమించండి, నాపేరు సుభాషిణేగాని, భాషే లేదు. నన్ను భగవంతుడెవ్వరితోనూ మాట్లాడవద్దన్నాడు, కనీసం మీతోగూడా.''

'సుభాషిణీ,' అరుద్దామనుకున్నాను.

గొంతు పెగల్లేదు.

మా యిద్దరి మనసుల్లోని ఆవేదన ఒక్కటే నన్నమాట. సుభాషిణి నాలాగే మూగ జీవం. ఈ విషయం మావాళ్ళు నానుంచీ దాచినా వాళ్ళమీద కోపం రాలేదు.

మూగ జీవాలమైనా 'ఇద్దరం ఒక్కటే' నన్నభావం మమ్మల్ని సుదూర తీరాలకు తీసుకు పోయింది. అది మాకు అమృతరాత్రే!

సుభాషిణికి నేను, నాకు సుభాషిణి.

అంతటితో ఆగిపోతే బావుణ్ణు! ఉహుం.

మా అవ్యాజమైన ప్రేమకు నిదర్శనం, దర్శనం ఇచ్చింది.

ఎడారిలో జలపడి నీరు పైకి ఎగచిమ్మింది. విరిగిన కొమ్మ, ఇంకా చెట్టుకి అతుక్కు న్నట్టుగానే, ఆకుపచ్చగా, శోభాయమానంగా పూలు విరబూశాయి.

మా కలలు పండాయి.

మాకో బాబు పుట్టాడు.

వాడి పేరు సమస్యకాలేదుకాని, కొంత చర్చ జరిగింది.

చివరికి సుభాషిణి ''శ్రీ 'కంఠ' రమణ మూర్తి అయిన మీకు కంఠమూ లేదు. సుభాషిణి అయిన నాకు భాషాలేదు. ప్రస్తు తానికి 'బాబూ' అని పిలుద్దాం. తర్వాత వాడే నిర్ణయించుకుంటాడు పేరు; అన్న అభిప్రాయాన్ని వెలుబుచ్చింది.

నేనేకీభవించాను.

తొలిబిడ్డ ! కలలపంట !!

బాబు చేసే ప్రతిపనీ మాకు వింతగా తోచేది.

బాబుకి అన్నెల్లు వచ్చాయి.

అన్నప్రాశన చేశాము.

ఒక రోజున...

ఉయ్యాల్లో పడుకున్న బాబు 'ఉఁ...' లు కొడుతూ ఒక్కసారిగా 'అత్తా' అన్నాడు. 'అత్తత్తా' అంటున్నాడు.

వంటింట్లోంచి పరిగెత్తుకొచ్చింది సుభాషిణి, ఆమె కళ్ళల్లో నీళ్ళు. నావంక చూసింది. నా కళ్ళల్లో నీళ్ళు.

వాడికి నోటీసుల జీవితంలేదు.

మాలా నోటీసులివ్వనవసరమూ లేదు, పుచ్చుకోనవసరమూ లేదు. చాలు! మాకది చాలు !!